## క్లుప్తంగా

### అంబలి కేంద్రం ప్రారంభం


అంబలి పోస్తున్న జనార్దన్

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉచిత అంబలి కేంద్రం ఆదివారం ప్రారంభమైంది. పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేసే లేఖరి పల్లికొండ జనార్దన్ కొన్నేళ్లుగా ఏటా అంబలి పంపిణీ చేస్తున్నాడు. ఈసారి కూడా ఎండల నుంచి ఉపశమనం కల్పించేందుకు అంబలి పంపిణీ చేస్తున్నాడు. ప్రచారంలేకుండా నిర్వహిస్తుండటంపై జనార్దన్‌ను మండలవాసులు అభినందిస్తున్నారు.

### ఆత్మీయ సమ్మేళనంపై సమీక్ష

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఈనెల 4న నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమ ఏర్పాట్లపై ఆ పార్టీ మండల కన్వీనర్ మాధవరావు, మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి ఆదివారం వివిధ గ్రామాల్లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రధాన కార్యకర్తలు, ప్రముఖ నాయకులతో మాట్లాడారు. సమ్మేళనానికి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బీరవెల్లి, మలక్‌చించోలి, వంజర్, తాండ్ర(జి), ప్యారమూర్ తదితర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయిటి చందు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ విఠల్

తానూరు: మండల కేంద్రంలో ఉపాధిహామీ నిధులు రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ విఠల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్, మాజీ సర్పంచ్ మాధవ్‌రావ్ పటేల్, శివాజీపటేల్ తదితరులు పాల్గొన్నారు.

### మహారాష్ట్ర మద్యం సరఫరా చేస్తే చర్యలు

సారంగపూర్: పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ హెచ్చరించారు. మండలంలోని మలక్‌చించోలి-కౌట్ల(బి) ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విందు, వినోదాలకు తెలంగాణలోకి అక్రమంగా మహారాష్ట్ర మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామని పేర్కొన్నారు. వారి వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### వాహనాలు తనిఖీ


వాహనదారుడిని పరీక్షిస్తున్న ఎస్సై

కుంటాల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్సై సాయికిరణ్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాల- అంబకంటి రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపద్దని సూచించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. వారి వెంట ఏఎస్సై దేవరావ్, పలువురు సిబ్బంది ఉన్నారు.

### ఆలయంలో పూజలు

తానూరు: మండలంలోని బోరిగాం, తొండాల, ఎల్వి, మహాలింగి, భోసి గ్రామాల్లోని ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహాదేవుడి జెండా సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో పనులు ప్రారంభించారు. భోసి గ్రామంలో వీధుల్లో మహాదేవుడి జెండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

### పాపన్నగౌడ్ వర్ధంతి


సర్వాయి విగ్రహం వద్ద గౌడ సంఘం నేతలు

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం సర్వాయి విగ్రహం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నర్సాగౌడ్, దుర్గం వెంకాగౌడ్, గుగ్గిల్ల రాజేందర్‌గౌడ్, భూమన్న గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పరశురాంగౌడ్, జలేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# యథేచ్ఛగా అక్రమ వెంచర్లు

- అనుమతుల్లేకుండా ప్లాట్ల అమ్మకాలు
- ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


పార్డి(బి)లో అక్రమంగా వెలిసిన వెంచర్

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతి లేకుండా అడ్డగోలుగా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పంచాయతీలు ఆదాయం కోల్పోవడంతోపాటు అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొన్న వారు రిజిస్ట్రేషన్ కాక ఇబ్బందులు పడుతున్నారు. అనుమతులు ఉంటేనే స్థానిక గ్రామపంచాయతీ నుంచి ఇంటి నిర్మాణాలు చేపట్టవచ్చు.

**కలెక్టర్ ఆదేశించినా..**

కుభీర్‌తోపాటు పల్సి, పార్డి(బి), బెల్గాం, గొడ్సర, పాంగ్ర, సొనారి తదితర గ్రామాల్లో రియల్టర్లు అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. రెండు నెలల కిందట కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు పల్సి, కుభీర్ గ్రామాల్లో అక్రమ వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించి చేతులు దులుపుకొన్నారు. కాని తర్వాత సదరు వెంచర్లలోని ప్లాట్లను యథావిధిగా విక్రయించారు. పార్డి(బి)లో అక్రమ వెంచర్లలో కొందరు ఇటీవల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు.

**లేఅవుట్ లేకుండానే వెంచర్లు..**

సాగు భూములనే అమ్ముతూ నివాస స్థలాలుగా మారుస్తున్నారు. కొన్నిచోట్ల అధికారుల చర్యలతో నిలిచిపోతుండగా మరికొన్ని చోట్ల యథేచ్ఛగా సాగుతున్నాయి. లేఅవుట్ ప్రకారం రియల్టర్లు ముందుగా ఆయా గ్రామపంచాయతీల అనుమతి పొందాలి. రెవెన్యూ శాఖ నుంచి నాలా(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్స్ అసెస్‌మెంట్ యాక్ట్) మార్చకుండానే విక్రయాలు కొనసాగుతున్నాయి. వెంచర్‌లో 30 ఫీట్లకు తక్కువ కాకుండా రోడ్లు వేయాలి. నాలాతోపాటు మందిరం, పార్కుకు స్థలాలను కేటాయించాలి. రియల్టర్లు ఈ నిబంధనలేవి పాటించకపోవడంతో కొన్నవారు రిజిస్ట్రేషన్ కోసం కాక సదరు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.


పల్సిలో వెంచర్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

**చర్యలు తీసుకోవాలి..**

ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరగడంతో రియల్టర్ల కన్ను సాగుభూములపై పడింది. అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడంతో పంచాయతీలు, రెవెన్యూ శాఖలు ఆదాయం కోల్పోతున్నాయి. మండలంలోని 14 గ్రామాల్లో అక్రమ వెంచర్లున్నట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసే రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### అక్రమ వెంచర్లను తొలగించాలి



గ్రామాల్లోని అక్రమ వెంచర్లను అధికారులు తొలగించాలి. సక్రమంగా ఉంటేనే ఇంటి నిర్మాణానికి పంచాయతీ అనుమతి, బ్యాంకు రుణాలు లభిస్తాయి.

– వి.మోహన్, పార్డి(బి)

### రిజిస్ట్రేషన్ కావడం లేదు



అనుమతి లేని వెంచర్‌లో ప్లాట్లు కొన్నవారికి రిజిస్ట్రేషన్ కావడం లేదు. దీంతో తెలియక కొన్నవారు రిజిస్ట్రేషన్ కాక కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

– జాదవ్ పండిత్, సిర్పెల్లి

### అనుమతి లేనివి తొలగిస్తాం

మండలంలో అనుమతి లేని 14 వెంచర్లను గుర్తించాం. కొన్నిచోట్ల అనుమతి లేని వెంచర్‌లో హద్దురాళ్లను తొలగించాం. అనుమతులు తీసుకోవాలని రియల్టర్లకు చెప్పాం. ప్రస్తుతం కొంచెం పని ఒత్తిడి ఉంది. త్వరలోనే అక్రమ వెంచర్లను తొలగిస్తాం.

– బత్తుల విశ్వంబర్, తహసీల్దార్, కుభీర్

## ఆధ్యాత్మికతకు నిలయంగా నిర్మల్

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


మంత్రిని పూలమాలతో సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: ఆధ్యాత్మికతకు నిలయంగా కేంద్రంగా నిర్మల్ నియోజకవర్గం ప్రసిద్ధి గాంచిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నందిగుండం దుర్గామాత, కాళికామాత, రాజస్థానీయుల కులదైవం రాందేవ్‌బాబా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం, నిర్మల్ నియోజకవర్గంలోని అడెల్లి మహాపోచమ్మ దేవస్థానం, ఇతర ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో ప్రజల్లో భక్తి భావం పెరిగి సమాజంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గండి రామన్న ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, తదితరులు పాల్గొన్నారు.

### రేపు నాటిక ప్రదర్శన

ముధోల్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటికను ఈనెల 4న భైంసా పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డు సమీపంలో ప్రదర్శిస్తున్నట్లు భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నాటికకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్, సత్యాజి సొంగే, లక్ష్మన్న, రాజన్న, దిగంబర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

**పదాధికారుల సమావేశం..**

మండల కేంద్రంలోని శీల్‌శాంతి బుద్ధవిహార్ ఆవరణలో భారతీయ బౌద్ధ మహాసభ పదాధికారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణ వాగ్మారే, రామచంద్ర, శంకర్, పండిత్, గంగాధర్ పాల్గొన్నారు.

### మురళీకృష్ణ ఆలయంలో సత్సంగ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ భగవాన్ శ్రీ మురళీకృష్ణ ఆలయంలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగల మధ్య వచ్చిన సత్సంగ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాటు పూర్ణ విశ్వాసం కలిగి ఉండాలన్నారు. అనంతరము హారతి, తీర్థ ప్రసాదంతోపాటు అందరికి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పి.కిషన్, గంప శ్రీనివాస్, సత్యనారాయణ, విఠల్ పార్డికర్, పద్మనాభగౌడ్, రాజేందర్, మంగమ్మ, శంకరమ్మ, సదావతి, రజని, విజయలక్ష్మి, వాణి, అనురాధ, కల్పన పాల్గొన్నారు.

## ఆర్టీసీ ప్రయాణమే సురక్షితం


మాట్లాడుతున్న మేనేజర్ సాయన్న

లక్ష్మణచాంద: ప్రైవేట్ వాహనాల్లో కంటే ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మారంలో గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ధర్మారం మహాపోచమ్మ ఆలయం వద్దకు భక్తులు భారీగా తరలివస్తారని.. వారిని దృష్టిలో ఉంచుకునే నిర్మల్ నుంచి గ్రామానికి నిత్యం బస్సు తొమ్మిది ట్రిప్పులు నడుపుతున్నామని పేర్కొన్నారు. కాని వారు ఆర్టీసీలో కాకుండా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ తమకు సహకరించాలని ఆయన గ్రామస్తులను కోరారు. సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ దశరథ్, గ్రామస్తులు రాజేశ్వర్, ప్రభాకర్, సుమన్, భరత్, వినిత్, నారాయణరెడ్డి, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

## అరగంట ముందే చేరుకోవాలి

- విద్యార్థులకు పరీక్ష కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు

లక్ష్మణచాంద: నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని ఇన్‌చార్జి ఎంఈవో మధుసూదన్ తెలిపారు. మండలంలోని వడ్యాల్ పరీక్ష కేంద్రంలో 129మంది, లక్ష్మణచాంద పరీక్ష కేంద్రంలో 190 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వడ్యాల్‌లో సీఎస్‌గా చంద్రనాగకాంత్, డీ వోగా విజయభాస్కర్, లక్ష్మణచాందలో సీఎస్ రాంచందర్, డీవోగా గోపాల్‌రెడ్డి నియమితులయ్యారని తెలిపారు. కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించారు.

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో కేంద్రంలో 240 మంది పరీక్షల రాయనున్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 211 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. చీఫ్ సూపరిటెండెంట్‌గా విద్యాధర్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా సురేశ్ వ్యవహరిస్తారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ విశ్వంభర్, ఎంఈవో చంద్రకాంత్, ఎంపీవో కవిరాజు పరిశీలించారు.


లక్ష్మణచాంద: వడ్యాల్‌లో నంబర్లు వేస్తున్న సిబ్బంది

**డీఈవో పరిశీలన**

భైంసా: బాసర పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

## సంక్షిప్త వార్తలు

**ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం**

కుభీర్: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులను సన్మానించారు. ఆదివారం స్థానిక యాదవ సంఘం భవనంలో సభ ఏర్పాటు చేసి అభినందించారు. జంగిలి శివకుమార్ యాదవ్ యూనియన్ బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం, దొంతుల రంజిత్ యాదవ్ రైల్వే శాఖలో టీసీ ఉద్యోగం సాధించారు. సాయన్న, సురేశ్‌యాదవ్, సంఘం అధ్యక్షుడు ఉపు దత్తాత్రి, సాయినాథ్, కనకయ్య, శంకర్, దిగంబర్, దత్తాత్రి, గణేశ్ తదితరులు ఉన్నారు.

**'చలో పార్లమెంట్' జయప్రదం చేయాలి**

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామనే నినాదంతో ఈనెల 5న నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలో కార్యక్రమ నిర్వహణ కరపత్రం ఆవిష్కరించారు. . వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం నూతన్, తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య తదితరులు ఉన్నారు.

**'దాడి హేయమైన చర్య'**

భైంసాటౌన్: ఆరె మరాఠా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శివాజీపాటిల్‌పై హైదరాబాద్‌లో కొందరు దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అని ఆ సంఘం జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భందా దాడిని ఖండించారు. ఆదివారం భైంసాలో వారు మాట్లాడుతూ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తున్న శివాజీ పాటిల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు జేకే పటేల్, మదన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

**కొండగట్టుకు స్వాముల పాదయాత్ర**

కుంటాల: మండలంలోని ఓలా గ్రామానికి చెందిన పలువురు అంజన్న స్వాములు ఆదివారం కొండగట్టు అంజన్నస్వామి వద్దకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకుముందు ఓలా హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు.

**విగ్రహావిష్కరణలో మండల నాయకులు**

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలో తొలి కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని ఆదివారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో లక్ష్మణచాంద మండలంలోని పలు గ్రామాల సంఘం సభ్యులు పాల్గొన్నారు. నరేశ్‌కుమార్, రమేశ్, అశోక్, నితీశ్, సుమంత్, భూమేశ్, గంగాధర్, అరవింద్, రాకేశ్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

**ఈఎంటీల దినోత్సవం**

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయ భవనంలోని 108 కార్యాలయంలో ఆదివారం ఈఎంటీల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. జీవన్, శ్యాంకుమార్, శేఖర్, సాగర్, సతీశ్, సాయిబాబా, జ్ఞానేశ్వర్, హఫీజ్, బాలాజీ పాల్గొన్నారు.

**అన్నదానం**

ముధోల్: మండలంలోని రాంటెక్ గ్రామ శివాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

**పండ్లు పంపిణీ**

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన వీర హనుమాన్ విజయ యాత్రలో భాగంగా బాగులవాడ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి స్వయంగా స్వాములకు యువతకు పండ్లు పంపిణీ చేశారు.

### అటెన్షన్ ప్లీజ్.. స్తంభం సరిచేయరూ



భైంసారూరల్: మండలంలోని మాంజ్రి గ్రామ సమీపంలో 33/11కేవీ విద్యుత్ సరఫరా చేసే స్తంభం ఓ వైపునకు వంగి ప్రమాదకరంగా మారింది. స్తంభం కిందపడితే గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వంగిన స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాంబాబు, విద్యుత్ ఏఈ, ఫోన్: 93989 96368

### రైతుబజార్‌లో..

| కూరగాయలు | కిలో(రూ.లో) |
|---|---|
| టమాటా | 15 |
| వంకాయ | 50 |
| బెండకాయ | 40 |
| పచ్చిమిర్చి | 60 |
| కాకరకాయ | 50 |
| బీరకాయ | 70 |
| క్యారెట్ | 100 |
| గోరుచిక్కుడు | 60 |
| కొత్తిమీర | 120 |
| అల్లం | 50 |
| ఎల్లిగడ్డ | 60 |
| ఉల్లిగడ్డ | 20 |
| ఆలుగడ్డ | 20 |

– నిర్మల్‌టౌన్

### సినిమాలు




తిరుమల : దసరా

నారాయణ: బలగం

## ఈరోజు

### కంటివెలుగు శిబిరం

ఖానాపూర్: పట్టణంలోని తొమ్మిదో వార్డు పరిధిలో సోమవారం నుంచి కంటివెలుగు శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ తెలిపారు. తొమ్మిదో వార్డు ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### చెక్కులు పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలో సోమవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పర్యటిస్తారని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కొరిపెల్లి క్రిష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

### మంత్రి రాక

సారంగపూర్: మండలంలోని రాంసింగ్‌తండా గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు తెలిపారు. అనంతరం ఉదయం 11గంటలకు జామ్-బీరవెల్లి గ్రామాల మధ్య స్వర్ణ నదిపై నిర్మించే వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు సకాలంలో హాజరవాలని ఆయన కోరారు.

## నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- నిర్మల్ నుంచి పొన్కల్‌కు బస్సులు


పొన్కల్‌లో శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయం

మామడ: కోరిన కోర్కెలు తీర్చే భక్తుల ఇలవేల్పుగా ప్రసిద్ధి పొందిన మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల మూడో తేదీ నుంచి ఏడో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ప్రతిఏటా చైత్ర మాసంలో ఆలయ బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 3న శాంతిపాఠం, పూర్ణాహుతి, ధ్వజ రోహణం, గరుడపెల్లి, అగ్నిప్రతిష్ఠ, బలిహరణ, నిత్యహవనం 4న గోదాసమేత శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి కల్యాణం, భక్తులకు అన్నదానం, 5న వేదవిన్నపం, నిత్యహవనం, పూర్ణాహుతి, దిపోత్సవం, నిత్యహవనం, 6న రథబలి, రథోత్సవం, మహాపూర్ణాహుతి, స్వామివారికి అభిషేకం, ధ్వజరోహణం,7న నాగవెల్లి, పుష్పయాగం, ఏకాంతసేవ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల ప్రజలు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. ఇప్పటికే భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

**నిర్మల్ నుంచి ప్రత్యేక బస్సులు..**

ఈ జాతరకు వచ్చే భక్తుల కోసం నిర్మల్ నుంచి పొన్కల్ వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమశాల నిర్మించారు. రథోత్సవం, తెప్పోత్సవం వంటి కార్యక్రమాలను కనుల పండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

### సాక్షి ఎఫెక్ట్.. బోర్డును సరిచేశారు



జిల్లా కేంద్రంలో డివైడర్ల మధ్యలో మొక్కల సంరక్షణకు ఏర్పాటు చేసిన బోర్ల వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. దీనిపై గతనెల 31న సాక్షిలో వేలాడుతున్న విద్యుత్ ప్రమాదం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి విద్యుత్ తీగలు, బోర్డుకు మరమ్మతులు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

**వారసంత ప్రారంభం**

ముధోల్: మండలంలోని అష్ట గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారసంతను సర్పంచ్ సుకన్య, ఎంపీటీసీ సునీత ప్రారంభించారు. కార్యక్రమంలో సంధ్యారాణి, సునీల్, పోశెట్టి, శ్రీనివాస్, రాజు, ముత్యం, మోహన్‌రెడ్డి, మురళీ, అశోక్, శంకర్ ఉన్నారు.